క్లుప్తంగా

దేవాలయాల్లో భక్తుల విశేష పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల గ్రామ సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ, వేనూతల కాటమరాజుస్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయ స్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు ఆదివారం నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు.

ఘనంగా జిల్లా ఆవిర్భావ దినోత్సవం



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి, కొండలరావు

దర్శి: ప్రకాశం జిల్లా ఆవిర్భావ దిన వేడుకలను స్థానిక డాక్టర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండలరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, మానవత సేవా స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన టంగుటూరి ప్రకాశం పంతులు పేరును జిల్లాకు పెట్టినట్లు తెలిపారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లాలో అనేక విశిష్టతలు ఉన్నాయని, ఆర్థిక వనరులు కలిగిన ఖిల్లాగా ప్రకాశం జిల్లా వర్ధిల్లుతోందన్నారు. ఒంగోలు గిత్తలు, మార్కాపురం పలకలు, చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ఖ్యాతి గడించాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య యమపాశాలు



ఏడుకొండలు ఇంటిపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు



పెద్దయాదయ్య ఇంటి వద్ద కిందకు వేలాగుతున్న విద్యుత్ తీగలు

- ప్రమాదం అంచున విద్యుత్ తీగలు
- ఏక్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని జనం ఆందోళన

పెద్దారవీడు: మండలంలో తోకపల్లి పంచాయతీ హనుమాన్ జంక్షన్‌కుంట గ్రామంలో ఇళ్ల మధ్యలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. గ్రామంలో పెద్దగుడిపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో గుండు ఏడుకొండలు, కేశినపల్లి పెద్దమాదయ్య ఇళ్ల వద్ద విద్యుత్ తీగలు చేతికి అందుబాటులో ఉన్నాయి. ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా తీగలు ఉండడంతో ఇంటి యజమానులు ప్రాణ భయంతో ఇబ్బందులు పడుతున్నారు. కేశినేనిపల్లి సబ్‌స్టేషన్ నుంచి గుండు ఏడుకొండలు, మణికంఠ, వెంకటేశ్వర్లు ఇళ్ల మీదుగా విద్యుత్ తీగలు రైతుల పొలాల ట్రాన్స్‌ఫార్మర్లకు లాగారు. ఇళ్ల మీదుగా లాగిన తీగలు చేతికి అందేలా ఉన్నాయి.

ఇళ్లపైన పిల్లలు ఆటలు ఆడుకోవడానికి వెళ్తుంటారు. ఆ సమయంలో పిల్లల చేతులు తీగలను తగిలితే ప్రమాదం సంభవిస్తుందని ఆందోళన చెందుతున్నారు. అలాగే కేశినపల్లి పెద్దమాదయ్య ఇంటి దగ్గర బజారులో విద్యుత్ తీగలు చేతికి అందేలా కిందకు వేలాడుతున్నాయి. ప్రజలు రాకపోకలు సాగించే సమయంలో ఏ మాత్రం ఆదమరచి తీగలు తగిలితే పెద్ద ప్రమాదాలు జరుగుతాయని అక్కడ నివసించే ప్రజలు భయందోళన చెందుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే విద్యుత్ తీగలను సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటిపై ఉన్న తీగలను తొలగించాలి



మా ఇళ్లపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. మేము పనులకు పోయినప్పుడు ఇంటిపైకి ఎక్కి పిల్లలు ఆటలు ఆడుకుంటారు. పిల్లలు తీగలు పట్టుకుంటే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే ఇంటిపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గుండు ఏడుకొండలు, హనుమాన్‌జంక్షన్‌కుంట గ్రామం

విద్యుత్ తీగలు సరి చేయండి



మా ఇంటి దగ్గర బజారులో కిందకు విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. బజారులో రాకపోకలు సాగించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు వెంటనే ప్రమాదం జరగక ముందే వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలి.

– కేశినపల్లి పెద్దయాదయ్య, హనుమాన్‌జంక్షన్‌కుంట

‘కూటమి’పై కలిసికట్టుగా పోరాడదాం



బూచేపల్లిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై కలిసికట్టుగా పోరాడుదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చే వరకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ స్థాయి పదవులు పొందిన నాయకులు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తమపై నమ్మకంతో పదవులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని, ప్రజలకు అండగా ఉండాలని బూచేపల్లి సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏసుదాసు, రైతు సంఘం అధ్యక్షుడు బంకా నాగిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గంగాభవాని ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటి గంగ అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవరప్పాడు సమీపంలో ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటిగంగ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు, కామేశ్వర శర్మ ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఈవో గుంటపల్లి వాసు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

బైక్ అదుపు తప్పి మహిళకు తీవ్ర గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న పెద్ద లక్ష్మమ్మ

కురిచేడు: ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళకు గాయాలైన సంఘటన ఆదివారం స్థానిక దొనకొండ రోడ్డులోని నాగార్జున సాగర్ కాలువ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. త్రిపురాంతకం మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన దద్దాల యోగయ్య తన భార్య పెద్ద లక్ష్మమ్మతో కలిసి బైక్‌పై పొట్లపాడులోని గుత్తికొండ రామయోగితాత ఆలయానికి మొక్కు తీర్చుకునేందుకు వెళ్తున్నారు. కురిచేడు–దొనకొండ రోడ్డులో నాగార్జున సాగర్ కాలువ పక్కన మూల మలుపులో నీటి పైపులు దెబ్బతినకుండా రైతులు మట్టికట్ట పోశారు. ఆ ప్రదేశంలో బైక్ అదుపు తప్పి ఇద్దరూ కింద పడిపోయారు. పెద్ద లక్ష్మమ్మకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు గమనించి 108 కి సమాచారం అందించారు. పెద్ద లక్ష్మమ్మకు ప్రథమ చికిత్స చేసిన 108 సిబ్బంది మెరుగైన వైద్యంకోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆర్అండ్‌బీ అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో కొత్తగా ఈ మార్గంలో వచ్చే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లో రాగి తీగ చోరీ



రాగి తీగ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న రైతు సుబ్బారెడి


తాళ్లూరు: మండలంలోని తురకపాలెం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లో రాగి తీగ చోరీకి గురైంది. రైతు గజ్జల సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం ఏడు గంటల వరకు తన పొలానికి రైతు సుబ్బారెడ్డి నీళ్లు పెట్టుకుని ఇంటికి వెళ్లాడు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున పొలానికి నీళ్లు పెట్టడానికి వచ్చాడు. మోటార్ స్విచ్ ఆన్ చేయగా, మోటార్ తిరగలేదు. ఎందుకు తిరగలేదని పరిశీలించగా, అక్కడున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన పడేసి ఉంది. అందులో ఉన్న రాగి తీగ చోరీ జరిగి ఉంది. ఈ విషయంపై అధికారులకు సమాచారం అందించి పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపాడు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



తోకపల్లిలో నరసింహస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు భవానీప్రసాద్

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లి గ్రామంలో వెలసిన సద్గురు యోగానంద నరసింహస్వామి ఆలయంలో మాలధరించిన స్వాములు శనివారం రాత్రి మహాపడి పూజ కనుల పండుగగా నిర్వహించారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారిని పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి, గణపతి చిత్రపటాలకు, 11 మెట్లను పూలతో అలంకరించారు. గణపతి పూజతో ప్రారంభించి అభిషేకం, కలశం, అమ్మవారి పూజలు చేశారు. సద్గురు యోగానంద నరసింహస్వామికి 15 రకాల అభిషేకాలు, ఆభరణాలు నిర్వహించి మహాపడి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మాలధారణ స్వాములు, భక్తులతో నరసింహస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పడిపూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అల్పాహారం వితరణ చేశారు.



రామతీర్థం రిజర్వాయర్‌లో నిండుగా ఉన్న నీరు



గుండ్లకమ్మ ప్రాజెక్ట్

నీళ్లు పుష్కలం.. సాగుకు వదలం.!

- రామతీర్థం, గుండ్లకమ్మలో పుష్కలంగా నీళ్లున్నా.. సాగుకు సరిపడా వదలని అధికారులు
- రామతీర్థం రిజర్వాయర్ పరిధిలో 70 వేల ఎకరాల ఆయకట్టు
- గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలో 80 వేల ఎకరాల ఆయకట్టు
- రెండింటి కింద 50 వేల ఎకరాలకు మించని సాగు
- ప్రస్తుతం రామతీర్థంలో 85.2 మీటర్లు, గుండ్లకమ్మలో 3.1 టీఎంసీల నీళ్లు
- ఆయకట్టులో పంటల సాగుకు విడుదల చేయని అధికారులు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయానికి పూర్తిగా ప్రాధాన్యత తగ్గించేలా అడుగులు వేస్తున్నారు. వ్యవసాయం దండగని గతంలో సీఎం చంద్రబాబు అన్న మాటలను నేటికీ ఆయన హయాంలోని పాలకులు, అధికారులు పాటిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో రైతుల కోసం కొత్తగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ప్రారంభించకపోగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతు సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేశారు. పెట్టుబడి సాయంగా ఇస్తామన్న హామీని కూడా అమలు చేయలేమని ఏకంగా సీఎం చంద్రబాబే ప్రకటించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఇరిగేషన్ అధికారులు పంటల సాగుకు నీళ్లివ్వకుండా నిలిపివేశారు. జలాశయాల్లో నిండుగా నీరున్నప్పటికీ ఆయకట్టుకు సరఫరా చేయకపోవడంతో పంటల సాగు విస్తీర్ణం సగానికిపైగా తగ్గిపోయింది. రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారు.

కూటమి హయాంలో వ్యవసాయానికి మంగళం

పొలాలు బీళ్లుగా మారి రైతుల అవస్థలు...

పంటలు సాగు చేద్దామంటే ఇరిగేషన్ అధికారులు సాగర్ నీళ్లివ్వరు. వచ్చిన అరకొర నీటితో సాగు చేద్దామంటే వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడి సాయానికి చంద్రబాబు హయాంలోని కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. సొంత డబ్బు పెట్టి వ్యవసాయం చేద్దామంటే దిగుబడి వచ్చినా.. పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. దీంతో పంటలు సాగుచేయలేక పొలాలను బీళ్లుగా వదిలేయలేక రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రామతీర్థం రిజర్వాయర్, గుండ్లకమ్మ ప్రాజెక్టులో నీళ్లు పుష్కలంగా ఉన్నప్పటికీ తాగునీటికి గుక్కెడు నీళ్లిచ్చి ఆయకట్టులో ఆరుతడి పంటలకు మాత్రమే ఇస్తున్నారు. దాని వలన పంటలు అరకొరగా సాగుచేస్తే పెట్టిన డబ్బులు వస్తాయో.. రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరకు పొలాలన్నీ బీళ్లుగా మారుతున్నాయి.

ప్రభుత్వ తీరుతో కాడి కింద పడేసిన రైతులు...

అరకొర నీటితో చేసే వ్యవసాయంతో పంటల సాగుకు పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదు. వెనక్కి తిరిగి చూసుకుంటే పెట్టుబడి కోసం బ్యాంకులలో తాకట్టు పెట్టిన బంగారాన్ని కూడా తిరిగి తెచ్చుకునే పరిస్థితి లేదు. ఇలాంటి దశలో రైతులు వ్యవసాయం చేయాలంటే సాయం చేసే ప్రభుత్వం ఉండాలి. కానీ, కూటమి ప్రభుత్వానికి వ్యవసాయానికి సాయం చేసే ఉద్దేశమే లేదని తెలియడంతో ఒకవైపు అప్పులు పుట్టే పరిస్థితి లేక.. మరోవైపు నీళ్లు కూడా సరఫరా చేయక రైతులు కాడి కింద పడేశారు. పచ్చని పొలాలు బీళ్లుగా మారుతున్నా ఆవేదన చెందడం మినహా చేసేది లేక మౌనంగా రోదిస్తున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులో, రామతీర్థం రిజర్వాయర్‌లో సాగర్ నీళ్లు పుష్కలంగా ఉన్నా.. పంటల సాగుకు నీళ్లు కావాలని అన్నదాతలు అడగకపోవడమే అందుకు నిదర్శనంగా ఉంది.

నిర్లక్ష్యంగా అధికారులు, పాలకులు...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్చిదిద్దిన గుండ్లకమ్మ ప్రాజెక్ట్, రామతీర్థం రిజర్వాయర్లు జిల్లాకే తలమానికంగా ఉన్నాయి. దాదాపు రూ.600 కోట్లతో గుండ్లకమ్మ ప్రాజెక్టును వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించి 2008లో జిల్లా ప్రజలకు అంకితం చేశారు. దాదాపు రూ.60 కోట్లతో రామతీర్థం రిజర్వాయర్‌ను వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించి 2009లో ప్రజలకు అంకితం చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులోని కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా సుమారు 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, రామతీర్థం రిజర్వాయర్ పరిధిలో 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు డిజైన్ చేసి నిర్మించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులో 3.89 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 3.1 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజూ 900 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ద్వారా గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. కానీ, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలో ఖరీఫ్ సీజన్ పూర్తయినా.. లేట్ ఖరీఫ్ కూడా పూర్తి కావస్తున్నా వరినాటిన రైతులు 2 వేల ఎకరాలకు మించి లేరంటే.. రైతులు వరి సాగుకు ఏ స్థాయిలో ఆలోచిస్తున్నారో స్పష్టమవుతోంది. ఆరుతడి పంటలైన పొగాకు, శనగ, మొక్కజొన్న పంటల వైపు రైతులు ఆసక్తి చూపటం వెనుక పొలాలు, పంటలపై పెట్టే పెట్టుబడులను తగ్గించుకోవడానికే రైతులు ఇష్టపడుతున్నారని అర్థమవుతోంది.

అదేవిధంగా రామతీర్థం రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 85.34 మీటర్లు కాగా, ప్రస్తుతం అందులో 85.2 మీటర్ల సాగర్ జలాలు ఉన్నాయి. నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఉన్న రామతీర్థం కింద ప్రస్తుతం వరి, ఇతర పంటలన్నీ కలిపి కనీసం 15 వేల ఎకరాలకు మించలేదంటే ఆశ్చర్యం కలిగిస్తుంది. సుబాబుల్, పొగాకు, ఇతర పంటలు సాగుచేస్తున్నారే తప్ప వరి పంటకు మంగళం పలికే పరిస్థితి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోకపోవడంతో పాటు అధికారులు, పాలకులు వ్యవసాయాన్ని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పెట్టుబడి సాయంతో పాటు ఆయకట్టుకు నీళ్లు అందించకపోతే రైతులు పంటలు సాగు చేయకుండా పొలాలను బీళ్లుగా ఉంచే పరిస్థితి నెలకొంది. చివరకు జిల్లాకు తలమానికంగా ఉన్న గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్‌లు తాగునీటి అవసరాలకు తప్ప సాగునీటి అవసరాలకు ఉపయోగపడవనే ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

రామతీర్థంలో 85.2 మీటర్ల నీరు

రామతీర్థం రిజర్వాయర్‌లో పూర్తి నీటిమట్టం 85.34 మీటర్లు కాగా, ప్రస్తుతం 85.2 మీటర్ల వరకు ఉన్నాయి. రిజర్వాయర్ నుంచి దిగువకు సాగు, తాగునీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నాం.

– కోటేశ్వరరావు, ఎన్ఎస్‌పీ జేఈ

గుండ్లకమ్మ నుంచి 120 క్యూసెక్కుల నీరు విడుదల

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పూర్తి నీటి సామర్థ్యం 3.89 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.1 టీఎంసీలు ఉన్నాయి. దాని నుంచి ఎడమ ప్రధాన కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 20 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నాయి.

– నాగరాజు, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ డీఈ

పొలం విషయంలో వివాదం

- ఘర్షణలో ఒకరికి గాయాలు



వెంకటరెడ్డి

ముండ్లమూరు(దర్శి): పొలం విషయంలో వివాదం తలెత్తడంతో ఓ వ్యక్తిపై మరికొందరు దాడి చేసి బీర్లు సీసాలతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ముండ్లమూరులోని ఓ రెస్టారెంట్‌లో ఆదివారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. 16 సెంట్ల భూమి విషయమై తాళ్లూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన కుమ్మిత వెంకటరెడ్డితో ఆదివారం మధ్యాహ్నం అంబటి సుబ్బారెడ్డి మరి కొందరు మద్యం సేవించి గొడవ పెట్టుకున్నారు. సాయంత్రం సమయంలో కేబీ రెస్టారెంట్ వద్ద ఉన్న వెంకటరెడ్డి వద్దకు కుమ్మిత అంజిరెడ్డి, మరికొందరు కారులో వచ్చారు. క్రిష్ణిపాటి లక్ష్మీరెడ్డికి పొలం ఇవ్వాలని బెదిరించి బీరు సీసాలతో దాడి చేశారు. దీంతో వెంకటరెడ్డి తలపై తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు రావడంతో నిందితులు పారిపోయారు. సంఘటనా స్థలంలో పడిపోయిన వెంకటరెడ్డిని ఆయన మేనల్లుడు అంబటి అంజిరెడ్డి తన మోటారు సైకిల్‌పై ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముండ్లమూరు(దర్శి): బైక్ ఢీకొన్న సంఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ముండ్లమూరులో శేషయ్య(58) అనే పాదచారుడిని శనివారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తి వెనుక నుంచి ఢీకొట్టాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మరణించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.